అధైర్యపడొద్దు..అండగా ఉంటా..

బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

కులకచర్ల, అక్టోబర్ 7: కార్యకర్తలకు అండగా ఉంటామని ఎవ్వరు అధైర్యపడవద్దని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం చౌడాపూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకుడు చెవ్వ రమేశ్ తల్లి చెవ్వ రాములమ్మ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని చెప్పారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటానని, ఏ సమస్య ఉన్నా తమ వంతు పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ నాయకుల గెలుపుకోసం కృషి చేయాలన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు పాల నర్సింహులు నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సత్తినేని సుధాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాందాస్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు పీరంపల్లి రాజు, మఠం రాజశేఖర్, శివకుమార్, పెంటయ్య, రాములు, కృష్ణయ్య, పరిగి అశోక్, పార్టీ సోషల్ మీడియా సభ్యులు దాసు శ్రీను, ప్రభు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పలువురు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

వికారాబాద్, అక్టోబర్ 7 : వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ప్రజాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అర్థ సుధాకర్‌రెడ్డి సోమవారం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. వికారాబాద్ మునిస్పల్ పరిధిలోని ఆయా వార్డులకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు రత్నారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

షీ టీమ్స్‌పై అవగాహన..

అవగాహన కల్పిస్తున్న షీ టీం ఇన్‌చార్జి నర్సింహులు

పరిగి, అక్టోబర్ 7: బస్టాండ్‌లో ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తే వెంటనే సమాచారం అందించాలని, వారి ఆట కట్టిస్తామని పరిగి సబ్ డివిజన్ షీ టీం ఇన్‌చార్జీ నర్సింహులు పేర్కొన్నారు. సోమవారం పరిగిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పిస్తూ, ఎవరైనా వేధిస్తే వెంటనే డయల్ 100, 181లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి సమాచారం అడిగితే ఇవ్వరాదని, సైబర్ నేరాల బారిన పడి అనేక మంది మోసాలకు గురవుతున్నారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరు సహకరించాల్సిందిగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకటయ్య, కంట్రోలర్ ఎల్లయ్య, షీ టీం సభ్యులు మనీషా, శోభరాణి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంఈవోగా గోపాల్ బాధ్యతలు..

పరిగి, అక్టోబర్ 7: పరిగి మండల ఇన్‌చార్జి ఎంఈవోగా గోపాల్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలి ఆయన ఇన్‌చార్జి ఎంఈవోగా నియమితులవ్వగా సోమవారం బాధ్యతలను ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈవోగా పనిచేసిన హరిశ్చంద్ర అప్పగించారు. అనంతరం ఎంఈవో హరిశ్చంద్ర, ఇన్‌చార్జి ఎంఈవో గా పదవీ బాధ్యతలు స్వీకరించిన గోపాల్‌ను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిగురాల్‌పల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్‌రాథోడ్, కౌన్సిలర్ శ్రీనివాస్, ఎంఆర్‌సీ సిబ్బంది మోహన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, అక్టోబర్ 7: గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో పారిశుధ్యం, వీధిదీపాలు, తాగునీటి వ్యవస్థలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా కార్య దర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువుల్లో, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జం చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఈవో ఆనంద్‌రావు ఉన్నారు.

మర్పల్లి, అక్టోబర్ 7: రాష్ట్ర పోలీస్ శాఖ ఇటీవల ప్రకటించిన అవార్డుల్లో కరన్‌కోట్ ఎస్సై విఠల్ రెడ్డికి రాష్ట్రంలో ఏడో ర్యాంకు వచ్చిన సందర్భంగా సోమవారం మర్పల్లి బీజేపీ నాయకులు ఎస్సైకి పూలమొక్కను అందజేసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జైపాల్, శ్రీమంత్‌కుమార్, మహేశ్, నగేశ్ పాల్గొన్నారు

ప్రజావాణి దరఖాస్తులను
సకాలంలో పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

వికారాబాద్, అక్టోబర్ 7 : ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) లింగ్యా నాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో ప్రజావాణి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజా వినతులు, ఫిర్యాదులను అదనపు కలెక్టర్ సుధీర్ (స్థానిక సంస్థలు)తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 115 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో భూ సమస్యలు, ఇతర సమస్యలకు సంబంధించి ఉన్నాయన్నారు. స్వీకరించిన వాటిలో కొన్నింటిని సత్వరమే పరిష్కరించామన్నారు. వివిధ శాఖలకు చెందిన అర్జీలను అధికారులకు పంపించి పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వాసు చంద్ర , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలకు త్వరలో చెక్

తాండూరు: ధరణిలో భూ సమస్యలకు త్వరలో చెక్ పెట్టేవిధంగా చర్యలను తీసుకోవాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ అధికారులకు సూచించారు. సోమవారం తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో 18 ఫిర్యాదులను స్వీకరించారు. తాండూరు మండల పరిధిలోని అంతారం గ్రామంలో ఎస్సీలకు స్మశానవాటిక లేదని ఫిర్యాదు రావడంతో భూ సేకరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెద్దేముల్‌లో ఆరు ఫిర్యాదులు

పెద్దేముల్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం ఆరు ఫిర్యాదులను స్వీకరించినట్లు మండల ఎంపీడీవో జర్నప్ప తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మార్వో కె.కిషన్, ఎంపీవో రతన్‌సింగ్, ఏపీవో నర్సింహులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతా, ఎస్ఎల్ఐ మోహన్ సింగ్, ఏఈవో వినయ్ కుమార్, ఏపీఎం బాలయ్య, ఎంఈవో నర్సింగ్ రావు హాజరయ్యారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్

తాండూరు: ఫిర్యాదులను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

పెద్దేముల్ : ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన అధికారులు

వికారాబాద్, అక్టోబర్ 7: వికారాబాద్ ఆలంపల్లి శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం శ్రీ అనంతపద్మనాభస్వామిని గరుఢ వాహనంపై ఊరేగించారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఈ ఊరేగింపులో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

బొంరాస్‌పేట, అక్టోబర్ 7 : దసరా నవరాత్రులు బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా దుద్యాల మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో హోమం నిర్వహించారు. బొంరాస్‌పేట మండల కేంద్రంలోని దుర్గామాత దేవాలయంతో పాటు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రతిష్టించిన దుర్గామాత అమ్మవారు సోమవారం మహాచండీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండపాల్లో రాత్రిపూజ భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కులకచర్ల, అక్టోబర్ 7 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

గుండెపోటుతో ఫిజికల్ డైరెక్టర్ మృతి

పరిగి/కులకచర్ల అక్టోబర్ 7: పరిగి మండలం జాఫర్‌పల్లి మోడల్ స్కూల్‌లో ఫిజి కల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న హన్మంతు ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. పరిగిలో నివాసముంటున్న ఆయనకు ఆదివారం రాత్రి గుండెపోటు రావ డంతో వెంటనే ప్రభుత్వ దవాఖానకు తర లించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనం తరం వికారాబాద్ ఆసుపత్రికి తరలి స్తుండగా చనిపోయారు. ఆయన ఆరు సం వత్సరాలుగా జాఫర్‌పల్లి మోడల్ స్కూల్ లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేశారు. కాగా కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముది రాజ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు,చెలిమెళ్ల బాల ముకుందం పరిగి నియోజక వర్గం ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రామస్వామి ముదిరాజ్, డాక్టర్ జగన్మోహన్ ముదిరాజ్, అంజిలయ్య ముదిరాజ్, రామకృష్ణ ముదిరాజ్, వెంకటయ్య, కులకచర్ల మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చంద్రలింగం ముదిరాజ్, ఉపాధ్యాయ, ఉద్యోగ , ముదిరాజ్ సంఘం, వివి ధ పార్టీల నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

జమ్మికట్ట వరకు
తాత్కాలిక రోడ్డు

తాండూరు రూరల్, అక్టోబర్ 7: తాం డూరు మండలం, కరణ్‌కోట గ్రామంలో దసరా పండుగ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జమ్మికట్ట వరకు తాత్కాలిక రోడ్డు వేశారు. మాజీ ఎంపీపీ శరణు బసప్ప, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో రోడ్డు వేయించారు. బురదమయంగా ఉన్న రోడ్డుపై కంకర వేసి, రోడ్డును చదును చేయడం పై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గర్భిణీ మృతిపై ఆరా

యాలాల, అక్టోబర్7: తాండూరు నర్సింగ్ హోంలో చికిత్స పొందుతూ గర్భిణీ అక్షిత (21)మృతి చెందిన ఘటన పై సోమవారం వికారాబాద్ డీఎం డా.రవీందర్, హెచ్‌వో జీవరాజ్‌లు నర్సింగ్ హోమ్‌ను సందర్శించి గర్భిణీ మృతికి గల కారణాలను వైద్యురాలు డా.హుస్నామహమ్మద్‌ను అడిగి తెలుసుకొన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

దోమ, అక్టోబర్ 7: భూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి తప్ప క్షణికావేశంతో దాడులకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని రాకొండ గ్రామంలో అసైన్డ్ భూమి విషయంలో ఆదివారం ఘర్షణ జరిగిన స్థలాన్ని ఆయన అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేనంబర్ 94 అసైన్డ్ భూమి విషయంలో రెవెన్యూ అధికారులతో పూర్తి స్థాయిలో సర్వే చేయించి ఇరు కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.చిన్న చిన్న విషయాలతో ఒకరిపై మరొకరు దాడులు చేసుకొని తమ కుటుంబాలను నాశనం చేసుకోవద్దన్నారు. సమస్యల పరిష్కారానికి న్యాయపరమైన మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎస్సై ఆనంద్‌కుమార్, ఆర్ఐలు సుదర్శన్, రామచంద్రారావు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాకొండ గ్రామంలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 7 : వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మహిళా సంఘాల సభ్యులు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినయ్‌కుమార్ ఏపీఎం లక్ష్మయ్య, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ చెన్నారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణిత మేళాతో సులువుగా రాణింపు

దోమ,అక్టోబర్ 7: గణిత మేళా విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందిస్తుందని ప్రథం సంస్థ మండల కోఆర్డినేటర్ మురళీకృష్ణ అన్నారు. మండల పరిధిలోని అయినాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రథం సంస్థ ఆధ్వర్యంలో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు సోమవారం గణిత మేళా నిర్వహించినట్లు సంస్థ కోఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేళా ద్వారా విద్యార్థులు సులువుగా గణిత సామర్థ్యాలను తెలుసుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దసరాకు 6,304 ప్రత్యేక బస్సులు

- టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): సద్దుల బతుకమ్మ, దసరా పండుగలకు ప్రయాణికులను క్షేమంగా సొంతూళ్లకు చేర్చేందుకు టీజీఎస్ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా 6,304 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ప్రయాణికుల సంక్షేమార్థం ఆర్టీసీకి పోలీస్, రవాణాశాఖలు సహకరించాలని కోరారు. దసరా ఆపరేషన్స్‌పై హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో సోమవారం సజ్జనార్ అధ్యక్షతన పోలీస్, రవాణాశాఖ అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. టీజీఎస్ ఆర్టీసీలో అనుభవం గల డ్రైవర్లు ఉన్నారని, వారు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారని, అందుకే ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణించాలని సూచించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఈ నెల 9 నుంచి 12 వరకు అధిక రద్దీ ఉండే అవకాశం ఉండటంతో ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. 'మహాలక్ష్మి' పథకం దృష్ట్యా గత ఏడాదితో పోల్చితే అదనంగా 600 ప్రత్యేక బస్సులను నడుపనున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్‌రోడ్స్, ఎల్బీనగర్, ఆరాంఘర్, కూకట్‌పల్లి, గచ్చిబౌలి, బోయిన్‌పల్లి, జగద్గిరిగుట్ట, సుచిత్ర, ఐఎస్‌సదన్, బోరబండ, శంషాబాద్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు వెల్లడించారు. జేబీఎస్ నుంచి 1,602, ఎల్బీనగర్ నుంచి 1,193, ఉప్పల్ నుంచి 585, ఆరాంఘర్ నుంచి 451అదనపు బస్సులను నడుపుతున్నట్టు తెలిపారు. తిరుగు ప్రయాణం రద్దీ దృష్ట్యా 13, 14 తేదీల్లోనూ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ముందస్తు రిజర్వేషన్ కోసం tgsrtcbus.inలో బుక్ చేసుకోవాలని, పూర్తి సమాచారం కోసం 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు. హైదరాబాద్ సిటీ అదనపు కమిషనర్(ట్రాఫిక్) విశ్వప్రసాద్ మాట్లాడుతూ టీజీఎస్ఆర్టీసీకి తమ సహకారం ఉంటుందని తెలిపారు.

తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానంటూ..

బంజారాహిల్స్, అక్టోబర్ 7: తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తిని నమ్మించి మోసం చేసిన ఘటన బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హుమాయున్‌నగర్ నివాసి ఎన్‌టీ. జగన్నాథ్ చార్టెడ్ అకౌంటెంట్. అతడికి ఆరునెల కిందట సాయిచంద్ గౌడ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ప్రముఖ ఆభరణాల సంస్థలకు తాను బంగారం సరఫరా చేస్తుంటానని, తక్కువ ధరకు బంగారం ఇస్తానంటూ నమ్మబలికాడు. 100 గ్రాముల బంగారం మార్కెట్‌లో సుమారు రూ.7లక్షలు ఉంటుందని, తాను రూ.6 లక్షలకే ఇస్తానంటూ చెప్పాడు. అతడి మాటలు నమ్మిన జగన్నాథ్.. జూన్ 23న బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో సాయిచంద్‌గౌడ్‌కు రూ.3 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. మరుసటి రోజే బంగారం ఇస్తానంటూ వెళ్లిన సాయిచంద్.. వివిశ కారణాలు చెబుతూ దాటవేయడం ప్రారంభించాడు. ఎన్నిసార్లు అడిగినా బంగారం ఇవ్వకపోగా.. బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితుడు సాయిచంద్ గౌడ్‌తో పాటు అతడికి సహకరించిన మరో వ్యక్తిపై బీఎన్ఎస్ 318(4), 316(2) 351(2), 51(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యంతో ఈవెంట్లు

ఆబ్కారీ దాడులు.. రూ.3 లక్షలు విలువ చేసే 75 మద్యం బాటిళ్లు సీజ్

సిటీబ్యూరో, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ సొంత ఖజానా నింపుకొనే క్రమంలో నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యంతో ఈవెంట్లు నిర్వహిస్తున్న రిసార్ట్స్‌పై శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు వేర్వేరు రిసార్ట్స్‌లో అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యాన్ని వినియోగిస్తున్న నిర్వాహకులపై కేసులు నమోదు చేయడంతో పాటు వారి వద్ద నుంచి సుమారు రూ.3 లక్షల విలువ చేసే 75 ఖరీదైన నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఈఎస్ డా.కృష్ణప్రియ కథనం ప్రకారం.. మొయినాబాద్, వెంకటాపురం ప్రాంతంలోని రెయిన్‌బో రిసార్ట్స్ ఫామ్‌హౌస్‌లో నిర్వాహకులు ఆబ్కారీ శాఖ అనుమతి లేకుండా ఈవెంట్ నిర్వహించడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా పాండిచ్చేరి నుంచి తీసుకువచ్చిన నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యాన్ని వినియోగించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు రెయిన్‌బో రిసార్ట్స్‌పై దాడులు జరిపి రిసార్ట్స్ యాజమాన్యంతో పాటు ఈవెంట్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.2.12 లక్షల విలువ చేసే 53 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా.. అదే ప్రాంతంలోని అవిన్య కన్వెన్షన్ హాల్‌పై దాడులు జరిపి రూ.88,000 విలువ చేసే 22 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను సీజ్ చేసి, నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఈఎస్ వెల్లడించారు. మద్యం వినియోగించే ఈవెంట్లకు ఖచ్చితంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని, అంతే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన మద్యాన్ని వినియోగించకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని శంషాబాద్ ఈఎస్ డా.కృష్ణప్రియ హెచ్చరించారు.

ఇన్‌స్టా పేజీలో అసభ్య వీడియోలు .. కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబర్ 7: తనను ఉద్యోగంలో నుంచి తొలగించారన్న కోపంతో సంస్థకు చెందిన సోషల్‌మీడియా పేజీలో అసభ్యకరమైన వీడియోలు పోస్ట్ చేసిన అసిస్టెంట్ డైరెక్టర్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సినీ నిర్మాత, దర్శకుడు షేక్ నాగుల్ షరీఫ్ అనే వ్యక్తి త్వరలో నిర్మించనున్న ఓ సినిమాకు సంబంధించిన కార్యాలయాన్ని బంజారాహిల్స్ రోడ్ నం. 3లోని సాగర్ సొసైటీలో ఏర్పాటు చేశాడు. సినిమాకు సంబంధించిన ఆడిషన్లు చేస్తున్నారు.

కాగా, అతడి వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న టి.సృజన్ సాయి అనే యువకుడికి సినిమాకు సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ అఫీషియల్ పేజీ నిర్వహించే బాధ్యతలను అప్పగించాడు. నటీనటులతో పాటు ఇతర సాంకేతిక నిపుణులు అఫీషియల్ పేజీని ఫాలో అవ్వాలని నిర్మాత నాగుల్ షరీఫ్ సూచించాడు. కాగా, ఇటీవల సృజన్ సాయి ప్రవర్తనపై ఫిర్యాదులు రావడంతో అతడిని ఉద్యోగం లోనుంచి తీసేశారు. దీంతో ఆఫీసుకు వచ్చిన సృజన్ సాయి అక్కడి సిబ్బంది పట్ల దుర్భాషలాడి, సినిమాకు చెందిన అఫీషియల్ పేజీ పేరు మార్చడంతో పాటు అసభ్యకరమైన వీడియోలు, ఫొటోలు పోస్ట్ చేశాడు. పేజీని ఫాలో అవుతున్న మహిళలకు వాటిని పంపించాడు. ఈ మేరకు దర్శక, నిర్మాత షేక్ నాగుల్ షరీఫ్ సోమవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బీఎన్ఎస్ 319 (2), 336(2), 294తో పాటు 67 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గంజాయి విక్రయ కేంద్రాలపై ఎస్‌టీఎఫ్ దాడులు

నలుగురి అరెస్ట్.. మరో 44 మందిపై కేసులు నమోదు

సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ధూల్‌పేటలోని పలు చోట్ల గంజాయి విక్రయకేంద్రాలపై ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురిని అరెస్టు చేసి, ఏడుగురు గంజాయి విక్రయదారులతో పాటు 37 మంది వినియోగదారులపై కేసు నమోదు చేశారు. నిందితుల వద్ద నుంచి 24.460 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఎస్‌టీఎఫ్ ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి కథనం ప్రకారం.. ధూల్‌పేటకు చెందిన కిశోర్‌సింగ్, జ్యోతిబాయ్‌తో కలిసి తన నివాసంలో గంజాయి విక్రయిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ బృందం కిశోర్‌సింగ్ ఇంటిపై దాడులు జరిపి, 22.9 కిలోల గంజాయిని సీజ్ చేశారు. ఈ కేసులో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న కిశోర్‌సింగ్, జ్యోతిబాయ్‌ను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న లడ్డూ సింగ్, సాగర్‌సింగ్, వైష్ణవి సింగ్, పేపర్ వినోద్ సింగ్‌పై కూడా కేసులు నమోదు చేసినట్లు ఈఎస్ తెలిపారు. అలాగే పురానాపూల్, జియాగూడ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ బృందాలు.. పురానాపూల్‌లో దాడులు నిర్వహించి అభిషేక్ సింగ్, సుభాయ్ సింగ్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.560 కిలోల గంజాయితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా.. గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న మహేందర్‌సింగ్, గుడ్డూసింగ్, రోహిత్ యాదవ్‌తో పాటు గంజాయి వినియోగిస్తున్న 37మందిని గుర్తించి వారిపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఈఎస్ అంజిరెడ్డి వెల్లడించారు.